సాక్షి ఒడిశా

ఆదివారం । 28 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,92,940, బంగారం 3.15గ్రాములు, వెండి 11.3 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



ప్రిన్సిపాళ్లు, గుమాస్తాల వేతనాలు నిలిపివేత

- 8లో



గుణుపూర్‌లో పాలపోలమ్మ ఉత్సవాలు

- 8లో

న్యూస్‌రీల్

పోలీసులకు చిక్కిన నిందితుడు



పోలీసుల అదుపులో స్కూటీ, నిందితుడు

జయపురం: స్కూటీని దొంగిలించిన కేసులో నిందితుడిని జయపురం పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణంలోని సోంబారుతోటకు చెందిన విక్రమ్‌సింగ్ అలియాస్ బికిగా గుర్తించారు. పోలీసుల తెలిపిన ప్రకారం ఈనెల 25న జయపురం ఎన్‌కేటీ రోడ్డులో సామ్యరం జన్ సాహు అనే వ్యక్తి స్కూటీ అపహరణకు గురైంది. దీనిపై పట్టణ పోలీసు స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయడంతో పాటు విక్రమసింగ్ ప్రవర్తనపై అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ మేరకు నిందితుడు నేరం అంగీకరిచడంతో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరచినట్లు వివరించారు.

పాతపట్నంలో 'రాజ్యరాణి' హాల్టింగ్



పాతపట్నం రైల్వేస్టేషన్

పర్లాకిమిడి: ఉత్కళాంధ్రుల ఇలవేల్పు పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారి ఉత్సవాలు ఘనంగా కొనసాగనున్నాయి. ఆంధ్రతో పాటు ఒడిశాకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో జాతరకు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో గుణుపూర్ నుంచి రౌర్కెలా వెళ్లే రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్(18118)కు ఈనెల 30 వరకు పాతపట్నంలో 2నిమిషాలు హాల్టింగ్ కల్పిస్తున్నట్లు వాల్తేర్ డీఆర్‌ఎం అనుప్‌కుమార్ శత్పతి శనివారం ప్రకటించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.

24కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయి, నిందితుడితో పోలీసులు

రాయగడ: స్థానిక రైల్వేస్టేషన్ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం రైల్వే ఆర్‌పీఎఫ్, ఎక్సైజ్ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో 24కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనిని తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేయగా, కొరాపుట్ జిల్లా లమతాపుట్‌కు చెందిన సంతోష్ బొడో నాయక్(20) గా గుర్తించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సీమా బెరుక్ తెలిపిన వివరాల ప్రకారం.. బొడొ నాయక్ కొరాపుట్ నుంచి ప్రైవేటు బస్సులో కొరాపుట్ బస్టాండ్‌కు చేరుకున్నాడు. అనంతరం ఆటోలో రైల్వే స్టేషన్‌కు, అక్కడి నుంచి ట్రైన్‌లో మునిగుడ వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎక్సైజ్ సిబ్బంది, రైల్వే పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. రైల్వేస్టేషన్ ప్రాంగణంలో బ్యాగుతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని తనిఖీ చేయగా, అతని వద్ద ఉన్న బ్యాగులో 24కిలోల గంజాయి లభించింది. పట్టుబడిన సరుకు విలువ సుమారు 2.4 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. నిందితుడిని శనివారం ఉదయం కోర్టుకు తరలించారు.

5టీ పథకానికి అప్పర్ కొలాబ్ పాఠశాల ఎంపిక

జయపురం: పట్టణంలోని ఇరిగేషన్ కాలనీలో ఉన్న అప్పర్ కొలాబ్ ప్రాజెక్టు ఉన్నత పాఠశాలను 5టీ పథకంలో అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేశారు. ఇందులో భాగంగా పాఠశాల అభివృద్ధి, స్మార్ట్ తరగతి గదులు నిర్మాణం చేపట్టేందుకు అభిప్రాయ సేకరణ సమావేశం శనివారం నిర్వహించారు. ఇందులో మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్దార్థ పట్నాయక్, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, ప్రభుత్వ ఇంజినీర్ విశ్వనాథ్ పాత్రొ, బ్లాక్ అదనపు విద్యాధికారి మత్యుంజయ పండా, అప్పర్ కొలాబ్ ప్రాజెక్టు, తెలింగిరి ప్రాజెక్టు అధికారి, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు, పాఠశాల పరిచాలన కమిటీ ప్రతినిధులు హాజరయ్యారు. 5టీ పథకంలో ముందుగా స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, గ్రంథాలయం, సైన్స్ లెబరేటరీ, కంప్యూటర్ రూమ్, టాయిలెట్లు, పాఠశాల సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. హెచ్‌ఎం తపనకిరణ్ త్రిపాఠి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అమ్మవారి మందిరం

- ఈనెల 29 నుంచి రాయగడ గ్రామదేవత సంబరాలు
- 9రోజులు అత్యంత ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు
- 2లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం

గ్రామదేవతగా పూజలందుకుంటున్న రాయగడ భైరవీధిలోని బురదల పోలమ్మ అమ్మవారి ఉత్సవాలు ఈనెల 29 నుంచి ప్రారంభం కానున్నాయి. 9రోజులు జరగనున్న ఉత్సవాలను ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు కొత్త కమిటీ కొలువుదీరింది. యువత నడుం బిగించడంతో మరింత ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి. సంప్రదాయ పద్ధతిలో, అంబరాన్ని తాకేవిధంగా జరిపేందుకు నిర్వాహకులు ఇప్పటికే రంగం సిద్ధం చేశారు. – రాయగడ

పాహిమాం.. బురదల పోలమ్మ



బురదల పోలమ్మ అమ్మవారు



ఉత్సవాలకు చాటింపు వేస్తున్న దృశ్యం

అమ్మవారికి 9మంది అక్కా,చెల్లెళ్లు. ఒక అన్నదమ్ముడు. సాత పోలమ్మ, మజ్జిగౌరమ్మ, నూకాలమ్మ, బంగారమ్మ, అగ్నిగంగమ్మ, ఉగ్రతార, ముత్యాలమ్మ, మరిడమ్మ, బండారమ్మ అక్కాచెల్లెల్లు కాగా.. దువ్వేర పోతన అన్నదమ్ముడు. గ్రామదేవత ఉత్సవాలు ప్రారంభమవుతాయన్న 2 రోజుల ముందుగానే గ్రామంలో(పట్టణం)లో చాటింపు వేస్తారు. ఊరి తలయారితో అమ్మవారికి ప్రీతికరమైన ఆదివాసీ వాయిద్యాలతో ఈ చాటింపు వేయడం ఆనవాయితీ. ఈ ప్రక్రియతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టినట్లుగా భావిస్తారు. చాటింపు జరిగే గ్రామంలో ఉన్నవారు అమ్మవారి అనుపు పండగ రోజు తప్పనిసరిగా ఉండాలనేది ఇక్కడి ఆనవాయితీ. అదే సంప్రదాయాన్ని ఇప్పటి వరకు గ్రామస్తులు తూచా తప్పకుండా పాటిస్తున్నారు.

ఉజ్జిడి బండి..

ఉత్సవాలు ప్రారంభానికి ముందురోజు తెల్లవారుజామున ఉజ్జిడి బండిని ఊరేగిస్తారు. వెదురుతో రూపొందించిన ఒక బుట్టకు చక్రాలు అమర్చి, బండిగా చేస్తారు. దీనిని ఉజ్జిడి బండిగా పిలుస్తారు. ఆలయ పూజారి సంప్రదాయ పూజలను నిర్వహించిన అనంతరం బండిని పురవీధుల్లో ఊరేగిస్తారు. ఈ సయమంలో ఆదివాసీ వాయిద్యాలతో కొనసాగిన బండిలో చద్దన్నం వేస్తారు. సేకరించిన చద్దన్నాన్ని స్థానిక డీఎఫ్‌ఓ కార్యాలయం సమీపంలో పారవేస్తారు. దీనిని అప్పట్లో ఏనుగుల శాలగా పిలిచేవారు.

వెండి ఘటాలు..

అమ్మవారి ఉత్సవాలను నిర్వహించేందుకు ఏటా అమ్మవారి ప్రతీకలైన ఇత్తడి ఘటాలను స్థానిక మజ్జిగౌరి మందిరం నుంచి తీసుకువచ్చి ఉత్సవాల్లో నిలిపేవారు. అయితే ఈ ఏడాది భక్తుల కానుకల రూపంలో ఇచ్చిన వెండితో మజ్జిగౌరమ్మ, బురదల పోలమ్మలకు సంబంధించిన వెండి ఘటలను నిర్వాహకులు సిద్ధం చేశారు. ఈసారి ఉత్సవాల్లో 7 ఇత్తడి ఘటాలతో పాటు 2వెండి ఘటాలు ఊరేగింపులో పాల్గొంటాయి. ఇప్పటికీ దాతలు వెండిని అమ్మవారికి సమర్పిస్తుండటంతో వచ్చే ఏడాది మరికొన్ని వెండి ఘటాలతో పాటు అమ్మవారికి సంబంధించిన ఆభరణాలను చేసేందుకు యోచిస్తున్నారు.



దాతలు ఇచ్చిన విరాళాలతో తయారు చేసిన వెండి ఘటంతో కమిటీ సభ్యులు

అమ్మవారికి నివేదన..

అమ్మవారి ఉత్సవాల సందర్భంగా 9రోజులు అమ్మవారి ప్రతీకలుగా నిలిచే ఘటాలను నిలిపేందుకు మెయిన్ రోడ్డు వద్ద ప్రత్యేకంగా ఒక షెడ్డును నిర్మిస్తారు. ఇందులో ఘటాలను ఉంచి పూజిస్తారు. భక్తులు ఈ ఘటాల్లో ఈ కాలంలో లభించే పనస, నేరేడు, మామిడి పండ్లతో పాటు అరిసెలు వంటివి సమర్పిస్తారు. వాటిని ఘటల్లో వేసి మొక్కుబడులు తీర్చుకుంటారు.

సంప్రదాయాన్ని గౌరవించాలి..



మన సంప్రదాయాలను కాపాడుకోవాలనే ఉద్దేశంతొ ఏటా ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మొదట్లో గ్రామ పెద్దలు ఈ ఉత్సవాలను నిర్వహించేందుకు నడుం బిగించేవారు. సంప్రదాయాలు, ఆచార, వ్యవహారాలు భావితరాలకు కూడా అందివ్వాలన్న ఉద్దేశంతో ఈ ఏడాది ఉత్సవాలను నిర్వహించేందుకు యువతకు బాధ్యతలు అప్పగించారు. అందరి సహకారంతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి. ఇందులో నావంతు సహకారాన్ని అందించేందుకు కృషి చేస్తా.

– నెక్కంటి భాస్కరరావు, రాజ్యసభ మాజీ ఎంపీ

భారీగా భక్తులు..



ఈ ఏడాది అమ్మవారి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. యువత ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరిస్తున్నారు. 9రోజులు జరిగే ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రీతికరమైన ఆదివాసీ డప్పులు ఏర్పాటు చేశాం. విద్యుత్ దీపాలంకరణ ఈసారి ప్రత్యేకంగా ఉంటుంది. పారిశుద్ధ్య మెరుగుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. అనుప పండగ రోజు దాదాపు 2లక్షలకు పైగా భక్తులు రానున్నారు. వారికి తాగునీరు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నాం.

– బార్లి జగన్‌మోహన్ నాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు

రూ.10 లక్షల వ్యయంతో..



ఈ ఏడాది అమ్మవారి ఉత్సవాల కోసం దాదాపు రూ.10 లక్షలు వెచ్చించేందుకు అంచనా వేశాం. దాతలు విరాళాల రూపంలో ఇచ్చిన మొత్తంతో పాటు ఉత్సవ పందిరి వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద విరాళాలు స్వీకరిస్తున్నాం. ఉత్సవాల 9రోజులు నిత్యపూజల కోసం అధికంగా ఖర్చవుతుంది. గ్రామం శుభిక్షంగా ఉండాలంటే అమ్మవారిని శాంతింపజేయడం ప్రధానం.

– ఎద్దు శ్రీహరి, ఉత్సవ కమిటీ సాధారణ కార్యదర్శి

ప్రత్యేక పూజలు..



ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం. ఉదయం, సాయంత్రం హారతితో పాటు షోడషోపచార పూజలు చేస్తాం, మే 30న అమ్మవారికి కాలునొప్పులు, జూన్ 1 నుంచి రోజూ సాయంత్రం పట్టణంలో ఘటాలు ఊరేగింపు కార్యక్రమం ఉంటుంది. జూన్ 4న మధ్యాహ్నం నీలధార, పాలధార, రాత్రికి ఉయ్యాలు ఊగడం వంటి కార్యక్రమాలు కొనసాగుతాయి. అమ్మవారి తాత్కాలిక షెడ్డు వద్ద ఘటాలు నిలిపే ప్రాంతంలో భక్తులు ఘటాల్లో పళ్లు, పసుపు కుంకుమలు సమర్పించవచ్చు. ఈ 9రోజుల పండుగలో భాగంగా అదనంగా మరో 8మంది పూజారులు సేవలందించనున్నారు.

– బలముండ, ఆలయ ప్రధాన పూజారి

నీతిఆయోగ్ సమావేశానికి సీఎం గైర్హాజరు

భువనేశ్వర్: న్యూఢిల్లీలో శనివారం జరిగిన నీతిఆయోగ్ పాలకమండలి సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గైర్హాజరయ్యారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యమంత్రి ముందస్తు నిర్ధారిత కార్యక్రమాల ఒత్తిడితో హాజరు కాలేకపోయారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం ఎటువంటి అధికారిక ప్రకటన జారీ చేయలేదు. నవీన్ నేతృత్వంలో 5వ విడత పాలనకు నాలుగో ఏడాది పూర్తి కావస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతిశాఖ పనితీరును ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా సమీక్షిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం మూడు శాఖల పనితీరుపై సీఎం సమీక్ష సమావేశంలో పాల్గొన్నట్లు సమాచారం. అయితే ఆదివారం దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న కొత్త పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి హాజరయ్యే అవకాశం ఉంది. ఈ కార్యక్రమాన్ని బహిష్కరించాలని ప్రతిపక్ష పార్టీల పిలుపు పట్ల బిజూ జనతాదళ్(బీజేడీ) సుముఖత వ్యక్తం చేయకపోవడం విశేషం. మరోవైపు దేశవ్యాప్తంగా తొమ్మిది రాష్ట్రాల ముఖ్యమంత్రులు(పంజాబ్, ఢిల్లీ, తెలంగాణ, బీహార్, పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, రాజస్థాన్, కర్ణాటక) నీతిఆయోగ్ పాలకమండలి 8వ సమావేశానికి దూరంగా ఉన్నారు. ఈ రాష్ట్రాలన్నీ బీజేపీయేతర రాజకీయ పార్టీలు పాలిస్తున్నాయి. బీజేడీ అధినేతగా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఇతరేతర కారణాలను ప్రదర్శించి దూరం కావడం చర్చనీయాంశంగా మారింది.

శ్రీమందిరంలో ప్రమాదం

- వేడి పప్పు పడి ఇద్దరు కార్మికులకు గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు

భువనేశ్వర్: పూరీ జగన్నాథ మందిరంలో శనివారం మధ్యాహ్నం విచారకర ఘటన చోటు చేసుకుంది. వేడి వేడి పప్పు ఆకస్మికంగా పడటంతో ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. బాధితులు పుప్పి ప్రధాన్(30), ప్రదీప్ సాహు(35)గా గుర్తించారు. వీరివురినీ స్థానిక జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చేర్పించి, చికిత్స అందిస్తున్నారు. అయితే ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఆలయంలోని భోగమండపం నుంచి మహాప్రసాదం తరలిస్తుండగా ప్రమాదం సంభవించింది. చందన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధి తొలాజొంగొ గ్రామస్తుడు పుప్పీ ప్రధాన్, బ్రహ్మగిరి గ్రామస్తుడు ప్రదీప్‌సాహు స్వామికి నివేదించిన అన్న ప్రసాదాలను తరలిస్తున్న సమయంలో పప్పు ఆకస్మికంగా జారడంతో వీరి శరీరంపై చిమ్మింది. దీంతో ఒంటిపై పలుచోట్ల గాయాలయ్యాయి. శ్రీమందిరం ప్రాంగణంలో కాలు జారడంతో తలపై మోస్తున్న తట్టల్లో పప్పు ఒలిగింది. పరిసరాల్లో శుభ్రత నిర్వహణ లోపంతో ఈ ప్రమాదం జరిగిందని సర్వత్రా విచారం వ్యక్తమైంది. నిర్వహణ లోపంతో శ్రీమందిరం సముదాయంలో తరచూ స్వల్ప ప్రమాదాలు చోటు చేసుకోవడం విచారకరం.

ఆపమన్నాడు.. అమాంతం దూకేశాడు!

- ట్రక్కు కిందకు దూకి గుర్తు తెలియని వ్యక్తి బలవన్మరణం



ట్రక్కు చక్రాల కింద మృతదేహం

జయపురం: సబ్ డివిజన్ పరిధి ఉమ్మిరి గ్రామంలో ట్రక్కు కిందకు దూకి, గుర్తి తెలియని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీనిపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం ఉదయం 6 గంటల సమయంలో జయపురం నుంచి బొరిగుమ్మ వైపు ట్రక్కు ప్రయాణిస్తోంది. అదే సమయంలో ఓ వ్యక్తి ఉమ్మిరి వద్ద ట్రక్కును ఆపాలని చేయి చాపాడు. డ్రైవర్ వాహనం వేగం తగ్గించి, ఆపేందుకు ప్రయిస్తుండగానే ఆ వ్యక్తి ట్రక్కు చక్రాల కిందకు అమాంతం దూకాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసున్న జయపురం సదర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ట్రక్కు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని, విచారిస్తున్నారు. మృతుడి బంధువులు ఎవరైనా ఆధారాలతో సంప్రదిస్తే.. వారికి మృతదేహాన్ని అప్పగిస్తామని సదర్ పోలీసు అధికారి ఈశ్వరతండి తెలిపారు. అలాగే సమాచారాన్ని జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లకు చేరవేసినట్లు ఎస్‌డీపీఓ హరీష్ బిసి వివరించారు.

ఆహార్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు

- నాణ్యత, శుభత్ర తప్పనిసరి: నోడల్ అధికారి శారదాప్రసాద్



ఆహార్ కేంద్రంలో ప్రజలతో మాట్లాడుతున్న సంయుక్త కార్యదర్శి శారదాప్రసాద్ పండా

భువనేశ్వర్: ఆహార్ కేంద్రాల్లో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌ఓపీ)ని కచ్చితంగా ఆచరించేలా చేయడం పట్ల రాష్ట్రప్రభుత్వ అధికారులు చర్యలు చేపడుతున్నారు. నగర పరిసర ప్రాంతాల ఆహార్ కేంద్రాల్లో పనితీరుని అధికారులు శనివారం ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో పలు ఆహార్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ కేంద్రాల్లో శుచి, శుభ్రత, పారిశుద్ధ్యం, వంట-వార్పులో నాణ్యత, వినియోగదారుల పట్ల సత్ప్రవర్తన తదితర అంశాలను అధికారులు అక్కడికక్కడే పరిశీలించారు. రాష్ట్ర గృహనిర్మాణం, నగర అభివృద్ధిశాఖ సంయుక్త కార్యదర్శి, ఆహార్ కేంద్రాల రాష్ట్ర నోడల్ అధికారి శారదాప్రసాద్ పండా స్థానిక క్యాపిటల్ ఆస్పత్రిలోని ఆహార్ కేంద్రాన్ని ప్రత్యక్షంగా సందర్శించారు. ఈ కేంద్రంలో మిషన్‌శక్తి స్వయం సహాయక బృందం ఇన్‌చార్జితో పాటు కేంద్రంలోని వినియోగదారులతో కూడా ఆయన ముఖాముఖి సంభాషించారు. అధికారులు వంటగదిని ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. ఆహారం తయారీ, కేంద్రం పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని స్వయం సహాయక బృందం సభ్యులకు తెలిపారు. ఆహారం కోసం కేంద్రానికి విచ్చేసే వారి పట్ల గౌరవప్రదంగా ప్రవర్తించి సముచిత సేవలు అందజేయడం కార్యాచరణగా పేర్కొన్నారు. ఆహార వృథాను అరికట్టడం, బలహీన వర్గాలపై ప్రత్యేక శ్రద్ధ చూపడంపై వారు ఉద్బోటించారు. నిరంతర శుచి, శుభ్రత పరిరక్షణలో భాగంగా స్వయం సహాయక బృందం సభ్యులు తగినంత పారిశుద్ధ్య సామగ్రి నిల్వ ఉంచాలని తెలిపారు. వడ్డన పురస్కరించుకుని తగు జాగ్రత్తలతో నేల, సర్వీస్ ప్రాంతాలను తరచూ శుభ్రం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో తొలి దశలో 5 మున్సిపల్ కార్పొరేషన్లలో 21 చోట్ల ప్రారంభించిన ఆహార్ కేంద్రాలు రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాయి. ప్రస్తుతం 115 పట్టణ స్థానిక సంస్థల్లో 167 చోట్ల ఈ కేంద్రాలు ఏర్పాటై, సేవల్ని అందిస్తున్నాయి. ఈ కేంద్రాలలో రోజూ 150 మిలియన్లకు పైగా భోజనాల్ని ఈ కేంద్రాలు అందజేస్తున్నాయి.

అన్నదాతను ముంచిన అకాల వర్షం

- వివిధ గ్రామాల్లో వందలాది ఎకరాల్లో దెబ్బతిన్న వరి పంట
- నష్ట నివేదికపై క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు



పంట నష్టాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ షొడంగి, అధికారులు



దెబ్బతిన్న పంటను చూసి విలపిస్తున్న రైతులు

జయపురం: సబ్ డివిజన్ పరిధిలో దాదాపు ప్రతి రోజూ కురుస్తున్న భారీ వడగళ్ల వర్షాలతో కోత దశకు చేరుకున్న వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో సామాజిక కార్యకర్త బి.హరిరావు, రైతులతో కలిసి జయపురం సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్‌ను, తహసీల్దార్ సాగరిక షొడంగిలను కలిశారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి, ఆదుకోవాలని విన్నవించారు. ఈనెల 24న కురిసిన వడగళ్లతో వర్షంతో పంట మొత్తం నష్టపోయామని కుమిలిపుట్, రొండాపల్లి ప్రాంతాలకు చెందిన రైతులు వాపోయారు. ప్రకృతి వైపరిత్యాల కారణంగా చేతికి అందాల్సిన దశలో పూర్తిగా కోల్పోయామని వివరించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ షొడంగి.. సమితి పరిధిలోని కుములిపుట్, రొండాపల్లి ప్రాంతాలలో పర్యటించారు. ఆయా గ్రామాల్లో బాధిత రైతులను కలిశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు.. అకాల వర్షంతో పాడయ్యిందని నీలాగుడకు చెందిన నరహరి పూజారి ఆవేదన వ్యక్తంచేశారు. కనీసం కోత కూడా పూర్తికాని పరిస్థితిలో పంట ఉందని, తగిన పరిహారం చెల్లించాలని కోరారు.

మరో 700 ఎకరాల్లో..

ఇదిలా ఉండగా.. జయపురం సమితి కొంగ, జాముండ, బొడొజివుని ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం వడగళ్ల వాన కురుసింది. కేవలం కొంగ గ్రామంలోనే 200ల ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లిందని రైతులు ధన పూజారి, సోను అమనాత్య, తులారాం పూజారి, చంద్ర అమనాత్య, మన పూజారి, అనంత పూజారి అధికారులకు శనివారం ఉదయం తెలియజేశారు. పరిసర గ్రామాల్లో మరో 500ల ఎకరాలకు పైగా వరి చేను పాడయ్యిందని తెలిపారు. నిన్నటి వరకు పంట బాగానే ఉందని.. ఒక్క రోజులేనే పరిస్థితి తారుమారయ్యిందని వాపోయారు. పంట కోత పూర్తి, ధాన్యాన్ని మండీలో విక్రయించేందుకు ఎంతో ఆశతో ఎదురు చూశామన్నారు. జిల్లా అధికార యంత్రాంగం స్పందించి, తమ గ్రామాల్లోని పంట నష్టాన్ని సైతం అంచనా వేసి, ఆదుకోవాలని కోరారు.

క్లుప్తంగా

2న అరుణాచలంకు ప్రత్యేక బస్సు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: పౌర్ణమి సందర్భంగా జూన్ 2వ తేదీన అరుణాచలంలో గిరిప్రదక్షిణ మహోత్సవాలకు శ్రీకాకుళం నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేశామని ఆర్టీసీ శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ కేఎస్ ఆర్ శర్మ తెలిపారు. జూన్ 2వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు ఆర్టీసీ బస్సు శ్రీకాకుళం బస్‌స్టేషన్ నుంచి బయలుదేరి 3న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం, గోల్డెన్ టెంపుల్, కంచి దర్శించుకుని అదే రోజు రాత్రి అక్కడి నుంచి బయలుదేరి 4వ తేదీ ఉదయం అరుణాచలం చేరుకుంటుందని అన్నారు. అరుణాచల గిరిప్రదక్షిణ, దర్శనం అనంతరం సాయంత్రం బయలుదేరి 5వ తేదీ సాయంత్రానికి శ్రీకాకుళం చేరుతుందని తెలిపారు. మనిషి ఒకరికి టికెట్ చార్జి రూ.4500గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. టికెట్లు కావాల్సిన శ్రీకాకుళం బస్ స్టేషన్‌లో గల రిజర్వేషన్ కౌంటర్ ద్వారా లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఆర్టీసీఆన్‌లైన్.కామ్ ద్వారా కొనుగోలు చేయవచ్చునని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7382921647, 7601038583 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. అనంతరం గిరి ప్రదక్షిణ పోస్టర్ ఆవిష్కరించారు.

ఆదర్శ గ్రామంగా చీపి

మందస: మండలంలో గిరిజన గ్రామమైన చీపి ఆదర్శ గ్రామంగా ఎంపికైంది. ఈ మేరకు అధికారులు శనివారం గ్రామాన్ని సందర్శించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఐటీడీఏ సీతంపేట ఆదేశాలతో చీపి సర్పంచ్ సవర లక్ష్మీప్రియ, ఎంపీటీసీ సవర కాంచన, ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు, ఐటీడీఏ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వంగపండు శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ సతీష్‌లు గ్రామంలోని మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ప్రభుత్వం ఈ గ్రామానికి రూ.20లక్షలు మంజూరు చేసింది. నిధుల వ్యయంపై చర్చించారు. రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సవర కామేసు, వైఎస్సార్ సీపీ నాయకులు సవర చిరంజీవి, సవర దీనబంధు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ.. యువకుడి మృతి



కోరాడ కార్తీక్ (ఫైల్)

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో అక్షర డిగ్రీ కళాశాల ఎదురుగా శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కత్తివరం గ్రామానికి చెందిన కోరాడ కార్తీక్(16) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్తీక్ తన స్నేహితుడు మద్దిల సిద్దార్థతో కలిసి కంచిలి వచ్చి పాలు సరఫరా చేసి తిరిగి స్వగ్రామానికి బైకుపై వెళుతుండగా ఎదురుగా మోటారు సైకిల్‌తో అతివేగంగా వస్తున్న బొరివంక గ్రామానికి చెందిన బీన సందీప్ బలంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో ముగ్గురూ కిందపడటంతో అంబులెన్స్‌లో సోంపేట సామాజిక ఆసుపత్రిలో చేర్పించారు. కార్తీక్ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం కిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం వేకువజామున మృతి చెందాడు. సిద్దార్థ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

నేలబావిలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

- డ్రైవర్ దుర్మరణం



మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

పోలాకి: ట్రాక్టర్‌తో సహా నేలబావిలో పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన పోలాకి మండలం మగతపాడు పంచాయతీ అప్పారావుపేటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెలమర గ్రామానికి చెందిన పల్లి గోవిందరావు(35) ట్రాక్టర్ కలాసీగా, డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో ట్రాక్టర్ ఓనర్ కరుకోల దుర్యోధనరావుతో కలసి పొలాలు దుక్కి దున్నేందుకు వెళ్లాడు. అప్పారావుపేటలో చింతాడ శ్రీనివాసరావు పొలంలో దుక్కి దున్నుతుండగా అదే పొలంలో ఉన్న నేలబావిలో ట్రాక్టర్ దూసుకెళ్లిపోయింది. వెంటనే పోలీసులు, మృతుని కుటుంబసభ్యులకు సమాచారం అందించగా అందరూ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఉదయాన్నే బావిలోని నీటిని తోడించారు. కొద్దిసేపటికి డ్రైవర్ గోవిందరావు మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి భార్య పుణ్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నర్సింహమూర్తి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ప్రిన్సిపాళ్లు, గుమాస్తాల వేతనాలు నిలిపివేత

- ప్రభుత్వ ఉత్తర్వుల అమలులో నిర్లక్ష్యంపై ఉత్తర్వులు



భువనేశ్వర్: రాష్ట్రంలో 233 కళాశాలల ప్రిన్సిపాళ్లు, గుమాస్తాల వేతనాలు నిలిపివేతకు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల అమలు, ఆచరణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉన్నత విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. విభాగం సహాయ డైరెక్టర్ గతంలో జారీ చేసిన ఆదేశాలను అమలు చేయడంలో వీరంతా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు ఆరోపణ. ఉత్తర్వుల అమలుకు పదే పదే గుర్తు చేసినా అమలు, ఆచరణకు నోచుకోలేదని విభాగం వివరించింది. ఉన్నతాధికారి ఆదేశాల పట్ల తరచూ గుర్తు చేసిన అవసరమైన సమాచారాన్ని అందించడంలో కళాశాలల సిబ్బంది విఫలమయ్యారు. విభాగం ఆదేశాల మేరకు చర్యలు చేపట్టనంత వరకు ఈ ఉత్తర్వులు అమలు ఉంటాయని స్పష్టంచేశారు. ఆదేశాల అమలు, ఆచరణ తర్వాత జీతభత్యాల విడుదలకు విభాగం తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు నిరీక్షించాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో 233సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు, హెడ్‌క్లర్క్, క్లర్క్‌ల జీతభత్యాలు డ్రా చేసి, విడుదల చేయవద్దని ఉన్నత విద్యావిభాగం కార్యదర్శిని ఆదేశించింది. ఈ జాబితాలో అంగుల్ నుంచి 5, బాలాసోర్ 12, బర్‌గడ్ 16, భద్రక్ 1, బొలంగీర్ నుంచి 23, బౌధ్ 1, కటక్ 24, దేవ్‌గడ్ 3, ఢెంకనాల్ 13, గజపతి 4, గంజాం 18, జగత్‌సింగ్‌పూర్ 12, జాజ్‌పూర్ 13, ఝార్సుగుడ 6, కలహండి 5, కంధమల్ 1, కేంద్రపడా, మయూర్‌భంజ్, ఖుర్దా కెంజొహర్ నుంచి 6 చొప్పున, కొరాపుట్ 5, మల్కగిరి 1, నవరంగ్‌పూర్ 2, నయాగడ్ 7, నువాపడా 1, పూరీ 9, రాయగడ 3, సంబల్‌పూర్ 7, సోన్‌పూర్ 1, సుందర్‌గఢ్ లోని 5 కళాశాలల సిబ్బందికి తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంత వరకు జీతభత్యాలు నిలిపి వేశారు.

విభేదాలు వీడి.. విజయానికి కృషి చేయండి



ప్రసంగిస్తున్న మాజీ ఎంపీ నెక్కంటి



సమావేశంలో పాల్గొన్న బీజేడీ నాయకులు, కార్యకర్తలు

- కార్యకర్తలకు మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు హితవు

రాయగడ: రానున్న సాధారణ ఎన్నికలు అత్యంత కీలకం. మనలో ఉన్న విభేదాలను వీడి విజయానికి అంతా కలసికట్టుగా కృషి చేయాలని రాజ్యసభ మాజీ ఎంపీ, బీజేడీ సీనియర్ నాయకుడు నెక్కంటి భాస్కరావు హితవు పలికారు. స్థానిక రాణిగుడ ఫారంలోని ఆయన నివాసంలో శనివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కాసీపూర్ సమితిలోని 24 పంచాయతీల నుంచి సుమారు 500మంది కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో రాయగడ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారని, మనలో ఐక్యత, విభేదాల కారణంగా ఇది జరిగిందన్నారు. దీంతో అభివృద్ధి తీవ్రంగా గండి పడిందని, కార్యకర్తల చేపట్టే పనులు పెండింగ్‌లో ఉండిపోతున్నాయని విచారం వ్యక్తంచేశారు. ఇకనైనా అంతా కలసికట్టుగా శ్రమించి, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. విజయావకాశాలు దెబ్బతినడానికి ఎంతో మంది పావులు కదుపుతారని, వాటిని విస్మరించి అధిష్టానం ఎవరికి టికెట్ కేటాయిస్తే.. వారిని గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టంచేశారు. పార్టీలో విభేదాలకు అంతర్గత కుమ్ములాటలకు తావివ్వకుండా విజయం పైనే దృష్టి పెట్టాలని మాజీమంత్రి లాల్‌బిహారి హిమిరిక అన్నారు. కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రాయగడ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఎవరికి టికెట్ ఇచ్చినా అంతా సైనికుకల్లా శ్రమించి విజయానికి కృషి చేయాలని కోరారు. బీజేడీ రాష్ట్రశాఖ ఉపాధ్యక్షుడు జగదీష్ పాత్రొ, వినోద్ నాయక్, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు గంగాధర పువ్వల తదితరులు ఈ సందర్భంగా ప్రసంగించారు.

మత్తిలిలో వైద్య శిబిరం



శిబిరంలో ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి మద్కుపోదర్ పంచాయతీలో పోలీసు శాఖ సౌజన్యంతో శనివారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులకు నిత్యావసర సరుకులు అందజేశారు. యువకుల మధ్య వాలీబాల్ పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి ట్రోఫీ అందజేశారు. వృద్ధులు, చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆరోగ్య పరీక్షలు చేపట్టి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యం బాగోలేని వారిని మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రానికి పంపేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ మనోజ్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరై, ఈ శిబిరాలను ప్రారంభించగా, మత్తిలి ఐఐసీ రంజన్‌కుమార్ మాఝి, లక్ష్మీ నారాయణ్ ముదిలి, సర్పంచ్‌లు, పోలీసు సిబ్బంది హాజరయ్యారు.

ఏపీ పీఈసెట్ ఎగ్జామినర్‌గా శ్రీనివాసరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పీఈసెట్- 2023 ఈ నెల 31వ తేదీ నుంచి జూన్ రెండు వరకు జరగనుంది. గుంటూరుకు చెందిన నాగార్జున విశ్వవిద్యాలయం ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ శ్రీనివాసరావును పీఈ సెట్‌కు ఎగ్జామినర్‌గా నియమిస్తూ స్థానిక రిజి స్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

పీఆర్ ఇంజినీర్ల సంఘ సమావేశం వాయిదా

అరసవల్లి: పంచాయతీరాజ్ డిప్లమో ఇంజినీర్ల సంఘం సర్వసభ్య సమా వేశం ఆదివారం షెడ్యూల్ ప్రకారం జరుగుతుందని ప్రకటించినప్పటికీ తాత్కాలికంగా వాయిదా వేస్తున్న ట్లు సంఘ అధ్యక్షుడు కేసీహెచ్ మహంతి తెలియజేశారు. పీఆర్ ఇంజినీర్ల బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఆయన ప్రకటించారు.

గుణుపూర్‌లో పాలపోలమ్మ ఉత్సవాలు



పాలపోలమ్మ అమ్మవారు



ఆకట్టుకున్న వేషధారణ

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో పాలపోలమ్మ ఉత్సవాలు శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఏటా తరహాలోనే ఈసారి కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మెయిన్‌రోడ్డు నుంచి గ్రామస్తులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి పాదాలను తీసుకువచ్చారు. ఊరేగింపులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వేషాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్థానిక యువకులు అగ్గి రవ్వలతో నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. గుణుపూర్‌కు చెందిన మహిళలు ఊరేగింపులో చేసిన నృత్యాలు అలరించాయి. 5రోజులు జరిగే ఈ ఉత్సవాలు బుధవారం ముగుస్తాయని నిర్వాహ కమిటీ ప్రతినిధులు చిన్నారి సాగర్, మోనింగి తిరుమల, లాడి నర్సింహమూర్తి తెలిపారు.



నృత్యాలు చేస్తున్న మహిళలు

బి.సీతాపురంలో అమ్మవారి సంబరాలు



గ్రామదేవత ఉత్సవాల్లో డప్పు వాయిద్యాలు

పర్లాకిమిడి: గుసాని సమితి బ్రాహ్మణ సీతాపురం గ్రామంలో గ్రామదేవత సీతాపురియాణి అమ్మవారి ఉత్సవాలు ఆడంబరంగా జరుతున్నాయి. వారం రోజులు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం ఘటాలను గ్రామంలో ఊరేగించారు.

పిల్లలు, పెద్దలూ అమ్మవా సంబరాలు సందర్భంగా విచిత్ర వేషాధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 30 మధ్యాహ్నం అమ్మవారి సంబరాలు అనుపోత్సవం నిర్వహిస్తామని కమిటీ తెలిపారు.



చిన్నారుల విచిత్ర వేషాధారణ

ఓబీసీ సర్వే గడువు పెంపు

- జూన్ 6వరకు అవకాశం కల్పిస్తూ వెనుకబడిన తరగతుల కమిషన్ ఉత్తర్వులు

భువనేశ్వర్: ఇతర వెనుకబడిన తరగతి(ఓబీసీ) ప్రజల సామాజిక, విద్యా స్థితిగతులపై రాష్ట్రవ్యాప్త సర్వే జూన్ 6 వరకు కొనసాగుతుందని ప్రకటించారు. ఇతర వెనుకబడిన తరగతుల రాష్ట్ర కమిషన్(ఓఎస్‌బీసీ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 314 మండలాలు, 114 పట్టణ, నగరపాలక సంస్థల ప్రాంతాల్లో ఈ సర్వే చేపట్టారు. ఈనెల 27తో ముగుస్తుందని గతంలో ప్రకటించారు. అయితే వేసవి తీవ్రత దృష్ట్యా సర్వే గడువును పొడిగించినట్లు కమిషన్ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 1నుంచి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ మోడ్‌లో సర్వే నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. సర్వేలో భాగంగా ప్రజలు తమ వివరాలను ఎన్యుమరేటర్లకు అందజేయాలని కోరారు. వివరాలను ఆన్‌లైన్(www.oscbc.odisha.gov.in)లో ఉచితంగా నమోదు చేసుకునేందుకు వీలవుతుందని తెలిపారు. ఆఫ్‌లైన్ మోడ్‌లో, కుటుంబ పెద్ద లేదా ఎవరైనా సీనియర్ వ్యక్తులు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సర్వే కౌంటర్లలో కుటుంబ వివరాలను దాఖలు చేసేందుకు వీలవుతుంది. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులను ఎన్యూమరేటర్లుగా నియమించారు. మోసేవా కేంద్రంలో పరిమిత రుసుం చెల్లింపుతో కుటుంబ వివరాలు నమోదు చేసుకోవచ్చు. ఇతర వెనుకబడిన వర్గాల ప్రజలు నివసించే ఇళ్లు, వారి జీవనోపాధి, మౌలిక సదుపాయాలు, ఆస్పత్రులు, పాఠశాలలు, మార్కెట్‌లు, కళాశాలలు మొదలైన వాటిపై ప్రశ్నావళితో సమాచారాన్ని సేకరించేందుకు సర్వే జరుగుతోంది. రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలకు 22.5శాతం, షెడ్యూల్డ్ తెగలకు 16.25శాతం, ఇతర వెనుకబడిన తరగతులకు(ఓబీసీ) 11.25 రిజర్వేషన్ కోటా కొనసాగుతోంది. సర్వే పూర్తయిన తర్వాత ఓబీసీల రిజర్వేషన్ కోటాల పునర్‌వ్యవస్థీకరణ పట్ల తుది నిర్ణయం తీసుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వం నమోదు చేసిన 208 ఇతర వెనుకబడిన వర్గాల సామాజిక, విద్యా స్థితిగతులను సర్వే చేస్తున్నారు.



జ్ఞాపకాల రుతువు

బడి ఒడిలో వదిలేసిన ఓ గురుతు ఇప్పుడు గుండె గదిలో జ్ఞాపకమై చిగురిస్తోంది. కాలేజీ ఫేర్‌వెల్ డే నాడు ఆగిపోయిన స్నేహగీతం.. ఇన్నాళ్లకు కొత్త కోయిల రాగమై వినిపిస్తోంది. బాల్యం అందించిన ఆనందం.. ఇప్పుడు మళ్లీ కావాలనిపిస్తోంది. ఆ రోజుల పేజీలు వెనక్కి తిప్పాలనిపిస్తోంది. స్కూల్‌లో పక్కన కూర్చున్న మిత్రుడు, కాలేజీలో సైకిల్‌పై చోటిచ్చిన సావాసగాడు, చదువు చెప్పిన మాస్టార్లను ఇంకోసారి చూడాలనిపిస్తోంది. ఎందుకంటే సిక్కోలులో ఇప్పుడు జ్ఞాపకాల రుతువు నడిపిస్తోంది. 'సర్' అనే పిలుపు అలవాటైపోయిన వాళ్లకు 'అరేయ్' అన్న పలకరింపును పరిచయం చేస్తోంది. కొత్త అనుబంధాల గజిబిజిలో పాత మిత్రులను కళ్లముందుంచుతోంది. ఇప్పుడు జిల్లా గెట్ టు గెదర్ అంటోంది.



- ఆనందాల అపూర్వ సమ్మేళనాలు
- ఏళ్ల తర్వాత కలుస్తున్న బాల్యమిత్రులు
- సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్న వైనం
- జిల్లాలో గెట్ టు గెదర్ సీజన్

ఇచ్ఛాపురం రూరల్:

ఆనాటి క్లాస్ రూమ్, అప్పటి పాఠాలు, ఆ రోజులు పంచిన జ్ఞాపకాలను కొందరు మళ్లీ తరచి చూసుకుంటున్నారు. కాలంతో పాటు పరుగులు పెడుతున్న వారు కాసేపు ఆగి..బాల్యాన్ని గుర్తు చేసుకుంటున్నారు. కొందరు బడికి వెళ్లి ఆ గోడలను తడిమి చూస్తున్నారు. ఇంకొందరు కాలేజీలకు వెళ్లి బెంచీలపై కూర్చుని సేద తీరుతున్నారు. మరికొందరు నాటి మిత్రులను కలిసి మళ్లీ స్టూడెంట్ లైఫ్‌కు వెళ్లిపోతున్నారు. జిల్లాలో గెట్ టు గెదర్ సీజన్ నడుస్తోంది. ప్రతి ఆదివారం ఎక్కడో ఒక చోట ఎవరో ఒకరు అపూర్వ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు.

గుర్తుకొస్తున్నాయి..

ఒకప్పుడు స్కూలు విడిచిపెట్టి వెళ్లిపోయాక స్కూల్‌డేస్ అన్నీ గుండెల్లోనే ఉండిపోయేవి. ఎప్పుడో ఎవరో క్లాస్‌మేట్ కలిస్తే ఆ జ్ఞాపకాలన్నీ మళ్లీ కళ్ల ముందుకు వచ్చేవి. సామాజిక మాధ్యమాలు వచ్చాక పాత జ్ఞాపకాలు నెమరవేసుకోవడం సులభమైంది. గ్రూపులు ఏర్పాటు చేసుకోవడం, ఫొటోలు షేర్ చేసుకోవడం, పాత స్నేహితులను మళ్లీ పలకరించడం ఇప్పుడు అందరికీ నిత్యకృత్యమైంది. ఆ ముచ్చట్లను సెల్‌ఫోన్లకే పరిమితం చేయకుండా.. చాలా మంది పూర్వ విద్యార్థులు మళ్లీ స్కూళ్లకు వెళ్లి కలుస్తున్నారు. అందరికీ అనువైన రోజును ముహూర్తంగా పెట్టుకుని అప్పటి గురువులను పిలుచుకుని మనసారా సన్మానించుకుంటున్నారు.



1985-86 బ్యాచ్‌కు చెందిన గోవిందపురం జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు(ఫైల్)

తారతమ్యాలు మరిచి..

స్కూలు, కాలేజీ రోజుల్లో దాదాపు అందరూ ఒకేలా ఉంటారు. కానీ రోజులు గడిచాక స్థాయిలు కూడా మారిపోతాయి. కొందరు 'పెద్దవాళ్లయిపోతారు'. చాలా మంది 'చిన్నవాళ్లు'గానే మిగిలిపోతారు. ఆ వైరుధ్యం పిలుపుల్లోనూ స్థిరపడిపోతుంది. కానీ ఈ అపూర్వ సమ్మేళనాలు ఆ తారతమ్యాలను దూరం చేస్తున్నాయి. చిన్నప్పుడు క్యారేజీలో అన్నం పంచిన మిత్రుడు 'అరేయ్' అని పిలిస్తే ఎంతటి పెద్దవారికైనా ఆనందంగానే అనిపిస్తోంది. సమాజంలో హోదా ఎంతలా పెరిగినా మళ్లీ పాత మనిషి లా కల్మషం లేకుండా మారిపోవడం అందరికీ ఆనందాన్ని అందిస్తోంది.



స్నేహితుడు మృతి చెందడంతో ఆయన కుటుంబానికి రూ.48,300 అందిస్తున్న ఈదుపురం పూర్వ విద్యార్థులు

సాటి వారికి సాయం

అపూర్వ సమ్మేళనాలు కేవలం ఆనందం కోసమే కాదు.. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి కూడా ఉపయోగపడుతున్నాయి. కొన్ని బ్యాచ్‌లు సొసైటీలుగా ఏర్పడి సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నాయి. చనిపోయిన తమ మిత్రుల పేరిట కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు కుటుంబానికి అండగా నిలుస్తూ పిల్లల పెళ్లిళ్లు, చదువులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. కష్టసుఖాల్లో ఒకరికి ఒకరు తోడుండాలని నిశ్చయించుకుంటున్నారు. కలకాలం తమ స్నేహం నిలిచేందుకు ఇవి దోహదపడతాయని అంటున్నారు.

30 ఏళ్లుగా కలుస్తున్నాం



నేను ఉన్నత స్థాయిలో ఉన్నప్పటికీ ఏటా చిన్ననాటి స్నేహితులను కలిసేందుకు ఒక్క రోజును తప్పకుండా కేటాయిస్తాను. ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటూ స్నేహితుల మధ్య వాలిపోయేవాడిని. గత 30 ఏళ్లుగా ఏటా 'గెట్ టు గెదర్'కు హాజరవుతున్నాను. చిన్ననాటి సంగతులు నెమరువేసుకోవడం, కష్టాల్లో ఉన్న స్నేహితులను ఆదుకోవడం జీవితంలో భాగంగా మలచుకున్నాను. అందుకే రిటైర్ అయ్యాక సిటీ వదిలి సోంపేటలో ఇల్లు కట్టుకొని స్నేహితుల మధ్య స్థిరపడ్డాను.

– దూగాన చిరంజీవులు, రిటైర్డ్ అడిషనల్ చీఫ్ జడ్జి, హైదరాబాద్

సంతోషంగా ఉంది



నా స్వగ్రామం ఇచ్ఛాపురం అయినా, ఉద్యోగ రీత్యా శ్రీకాకుళం కలెక్టరేట్‌లో సీసీగా పనిచేస్తున్నాను. ముప్పై మూడేళ్ల తర్వాత ఇటీవల స్నేహితులమంతా కలిశాం. మా మధ్యలేని స్నేహితుల పిల్లలు ఆర్థిక కష్టాల్లో ఉంటే వారి పిల్లల పేరున కొంత నగదును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడం, ఏటా టెన్త్ మెరిట్ విద్యార్థులకు రూ.22,500 మెరిట్ స్కాలర్‌షిప్ ఇచ్చేందుకు నిర్ణయించుకున్నాం. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది.

– సాడి కామేశ్వరరావురెడ్డి, సీసీ, కలెక్టరేట్, శ్రీకాకుళం

క్లుప్తంగా

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

తెర్లాం: మండలంలోని తమ్మయ్యవలస గ్రామంలో ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. గ్రామానికి చెందిన దివంగత సీఆర్‌పీఎఫ్ జవాన్ బొత్స కిశోర్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఈ పోటీలకు విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి దాదాపు 60 జట్లు హాజరయ్యాయి. వేసవి నేపథ్యంలో పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు వడదెబ్బ తగలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం చల్లగా ఉన్న వేళల్లోనూ, రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుగులోనూ ఈ పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. టోర్నీలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు నగదు బహుమతిని అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ‘తోండ్రంగి’ విద్యార్థులు



జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న సిబ్బంది

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని తోండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల విజయనగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-19 విభాగంలో జిల్లా జట్టు ప్రథమ స్థానం దక్కించుకున్న విషయం తెలిసిందే. ఇదే జట్టులో తోండ్రంగి ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థినులు ఉండగా, వీరిలో జట్టును ప్రథమ స్థానంలో నిలపడంలో విద్యార్థినులు కెంగువ దేవి, చిట్టి భవాని కీలకపాత్ర పోషించారని, వీరు జూన్ 6 నుంచి 10వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే 66వ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు మన రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని ప్రధానోపాధ్యాయుడు రమణరాజు, పీడీ సత్యనారాయణ తెలిపారు.

నేడు స్టాక్ మార్కెట్‌పై అవగాహన సదస్సు

మదనపల్లి: విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని హోటల్ ఎస్వీఎస్ లేక్ ప్యాలస్‌లో నాగసతీష్ వెల్త్ బిల్డర్స్ ఆధ్వర్యంలో స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులపై ఉచిత అవగాహన సదస్సు ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఫైనాన్షియల్ అడ్వయిజర్ కృష్ణ కైలాష్ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు, సాయంత్రం 7 గంటలకు సెషన్ల వారీగా జరిగే ఈ కార్యక్రమంలో స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు ఎలా పెట్టాలి, భవిష్యత్‌లో ఆర్థికావసరాల దృష్ట్యా డబ్బులను ఎలా ఆదా చేస్తే బాగుంటుందన్న అంశాలపై అవగాహన కల్పించనున్నామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9966610358ను సంప్రదించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: జిల్లాలో ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ పోస్ట్ భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని, ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. బీసీఏ, బీఎస్సీ, బీఈ, బీటెక్, పీజీతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలని, 2022 జూలై 1 నాటికి 21 నుంచి 35 ఏళ్ల వయసు ఉండాలన్నారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఒక సంవత్సరం కాలపరిమితికి నెలకు రూ.22,500 వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. ఐటీ సెక్టార్‌లో రెండేళ్ల అనుభవం కలిగిన వారికి 5 శాతం వెయిటేజీ ఇస్తామన్నారు. అర్హులైన వారంతా జూన్ 7వ తేదీలోగా నేరుగా కానీ రిజిస్టర్ పోస్ట్ ద్వారా కానీ కలెక్టర్ కార్యాలయానికి దరఖాస్తులు సమర్పించాలన్నారు. పార్వతీపురం మన్యం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ప్రశాంతంగా అంగన్‌వాడీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

పార్వతీపురం: కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల అభ్యర్థుల ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా రెవెన్యూ అధికారి జల్లేపల్లి వెంకటరావు అధ్యక్షతన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. బగాది జగన్నాధరావు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కేతిరెడ్డి విజయగౌరి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. పార్వతీపురం, పాలకొండ రెవెన్యూ డివిజన్లలోని మైదాన ప్రాంత మూడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఖాళీగా వున్న 3 అంగన్‌వాడీ కార్యకర్తలు, 9 అంగన్‌వాడీ సహాయకుల నియామకాల కోసం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేశారు. కార్యకర్తల పోస్టుకు 15 మంది అభ్యర్థులు హాజరు కాగా, సహాయకుల పోస్టుల కోసం 18 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కొమరాడ, పాలకొండ సీడీపీఓలు జి.సుగుణ కుమారి, ఎస్.గీత తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురానికి ఉత్సవ శోభ

- నేటి నుంచి ఇప్పలపోలమ్మ, ఎర్రకంచమ్మ, బంగారమ్మ గ్రామదేవతల జాతర
- నాలుగు రోజుల పాటు నిర్వహణ
- అంగరంగ వైభవంగా నిర్వహణకు ఏర్పాట్లు



పార్వతీపురం పట్టణంలో విద్యుత్ అలంకరణ




ఉత్సవాల నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తున్న ఆర్‌డీఓ హేమలత



ఇప్పలపోలమ్మ



ఎర్ర కంచమ్మ



బంగారమ్మతల్లి

పార్వతీపురం టౌన్: పార్వతీపురంలో ఇప్పలపోలమ్మ, ఎర్రకంచమ్మ, బంగారమ్మ గ్రామదేవతల జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. బుధవారం వరకు నాలుగు రోజుల పాటు జాతర అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. జాతర మొదటి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రెండవ రోజు సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం అమ్మవార్ల సిరిమానోత్సవం భారీ ఊరేగింపుతో ఘటాలను స్థానిక అమ్మవార్ల ఆలయాలకు తరలిస్తారు. బుధవారం ఘటాల అనుపోత్సవం నిర్వహిస్తారు. ఉత్సవాల నాలుగు రోజులు అట్టహాసంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. సాంప్రదాయ నృత్యాలు, డ్యాన్స్‌లు, కోలాటాలు, నృత్యాలు ఏర్పాటు చేశారు.

విద్యుత్ వెలుగులు

జాతర సందర్భంగా పార్వతీపురం ఉత్సవ శోభ సంతరించుకుంది. పట్టణ ప్రధాన రహదారి సారికి వీధి నుంచి పాత బస్టాండ్ వరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. వైకేఎం కాలనీ, బంగారమ్మ కాలనీలో విద్యుత్ అలంకరణ అందరినీ ఆకట్టుకున్నాయి. ఉత్సవాలకు వచ్చే భక్తులకు తాగునీటి సమస్య తలెత్తకుండా పట్టణంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అవసరమైన సహకారం అందిస్తున్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

సమన్వయంతో పని చేయాలి

ఇప్పల పోలమ్మ అమ్మవారి పండుగ, ఎర్ర కంచెమ్మ పండుగలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత అన్నారు. ఈ నెల 28 నుండి 30 వరకు నిర్వహించే ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచెమ్మ, బంగారమ్మ గ్రామ దేవతల పండుగ సందర్భంగా ఈ నెల 18వ తేదీన నిర్వహించిన సమావేశంలో చర్చించిన మంచినీటి సరఫరా, బందోబస్తు, విద్యుత్, ఊరేగింపు, దర్శనాలకు చేయాల్సిన ఏర్పాట్ల అంశాలపై శాఖల వారీగా తీసుకున్న చర్యలను ఆర్‌డీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో ఆర్‌డీఓ కె.హేమలత మాట్లాడుతూ ప్రజలు అధిక సంఖ్యలో హాజరవుతున్నందున గత సమావేశంలో చర్చించిన అంశాల ప్రకారం శాఖల వారీగా పట్టణంలో కావలసిన మౌలిక వసతుల ఏర్పాటులో అన్ని ప్రభుత్వ శాఖలు, ఆలయ కమిటీ కలిసి సమన్వయంతో పని చేసి పండుగను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. సామాన్య భక్తుల దర్శనాలకు అంతరాయం కలిగించకూడదన్నారు. పండుగ జరిగే రోజుల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు.

మంచినీటి సరఫరాకు చర్యలు

మున్సిపల్ కమిషనరు జె.రామ అప్పలనాయుడు మాట్లాడుతూ మంచినీటి సరఫరా కోసం తోటపల్లి రిజర్వాయరు నుండి నీరు విడుదల చేసినట్టు తెలిపారు. శానిటేషన్ పనులు, పంచాయతీరాజ్, మునిసిపల్ శాఖలు కలిసి ఏర్పాట్లు చేస్తున్నామని, పండుగ రోజుల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, శివారు ప్రాంతాలకు ట్యాంకర్లు ద్వారా నీరు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సీఐ కృష్ణారావు మాట్లాడుతూ బందోబస్తుకు సంబంధించి అదనపు సిబ్బందిని నియమించామని, ఊరేగింపు రూటు, సాధారణ ప్రజల ఆలయ దర్శనాలు, ముఖ్యుల దర్శనాలలో ఇబ్బందులు లేకుండా పోలీసు అధికారులు పర్యవేక్షణ జరుగుతుందన్నారు. పండుగ నిర్వాహకులు అందించిన ఊరేగింపు రూటుమ్యాపు ప్రకారం సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు బి.జయబాబు, బి.సీతారాం, దేవదాయ, వైద్య ఆరోగ్య, విద్యుత్, రోడ్లు భవనాలు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రక్తదాతలే ప్రాణదాతలు

- స్పీకర్ కోలగట్ల జన్మదిన వేడుకల్లో భాగంగా మెగా రక్తదాన శిబిరం
- 1030 యూనిట్ల రక్తం సేకరణ
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖరరావు



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీ చంద్రశేఖరరావు



రక్తదానం చేస్తున్న యువత

విజయనగరం: రక్తదాతలే ప్రాణదాతలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖరరావు అన్నారు. ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి జన్మదిన వేడుకల్లో భాగంగా నగరంలోని కోలగట్ల నివాసం వద్ద శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు ఈ నెల 28వ తేదీన కోలగట్ల పుట్టినరోజు పురస్కరించుకుని, ఆయన అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలంతా కొన్నిరోజులుగా సేవా కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయమన్నారు. నగరంలోని ఏడు ప్రాంతాల్లో చేపట్టిన ఈ రక్తదాన శిబిరంలో మొత్తం 1030 యూనిట్ల రక్తం సేకరించడం జరిగిందని, ఇదే ఆయనపై ఉన్న ప్రజాభిమానానికి నిదర్శనమన్నారు. మనమిచ్చే రక్తం మరొకరి ప్రాణాలు కాపాడడమే కాకుండా వారి కుటుంబానికి పెద్దదిక్కును దక్కించినవారమవుతామన్నారు. రోడ్డు ప్రమాదాల్లో తీవ్రగాయాలపాలై, సకాలంలో రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రక్తదానం చేస్తే ఆరోగ్యం చెడిపోతుందన్న అపోహలు వీడి, అందరూ రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యమే తప్ప నష్టమేమీ లేదన్నారు. ఒక మనిషి తన జీవిత కాలంలో ఎన్నిసార్లు అయినా రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానంతో మరింతమందికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని, స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు వచ్చిన వారందరికీ ధన్యవాదాలన్నారు. స్పీకర్ కోలగట్లకు నిత్యం ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, భవిష్యత్‌లో ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, రేవతి దేవి, ఫ్లోర్ లీడర్ ఎస్.వి.వి. రాజేష్, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ సంగంరెడ్డి బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల శత జయంత్యుత్సవాలకు ఏర్పాట్లు

- ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకులు భీష్మారావు



ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న కళాపీఠం వ్యవస్థాపకుడు భీష్మారావు, తదితరులు

విజయనగరం టౌన్: ఘంటసాల శత జయంత్యుత్సవాలు, ఘంటసాల స్మారక కళాపీఠం రజతోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నట్లు కళాపీఠం వ్యవస్థాపకులు భీష్మారావు తెలిపారు. శనివారం నగరంలోని కళాపీఠం ఆవరణలో ఆయా ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. గురజాడ కళాభారతిలో ఈ నెల 29వ తేదీ నుంచి జరిగే ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీసాయి సంతోషి నాట్యమండలి(సురభి) స్టేషన్ ఘనాపూర్ ఆధ్వర్యంలో భాస్కరుని సత్యజగదీష్ రచన, దర్శకత్వంలో సురభి సంతోష్ నిర్వహణలో ఘంటసాల చరిత్ర నాటక ప్రదర్శన ఉంటుదన్నారు. దీంతో పాటు భగవతి నృత్య కళామందిర్ దర్శకుడు వడ్లమాని రమణకుమారి బృందం ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర వైభవం నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి హాజరు కానున్నారన్నారు. కార్యక్రమంలో కళాపీఠం ప్రతినిధులు ధవళ సర్వేశ్వరరావు, దేవరాజు గోపాలకృష్ణ, హరి తదితరులు పాల్గొన్నారు.

నందివానివలసలో గజరాజులు



నందివానివలసలో సంచరిస్తున్న ఏనుగులు

గరుగుబిల్లి: ఏనుగులు బెడద వీడకపోవడంతో ప్రజలు, రైతులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. గత కొద్ది నెలల నుండి కొమరాడ, జియ్యమ్మవలస మండలాల పరిధిలో సంచరిస్తున్న ఏనుగులు శుక్రవారం మండలంలోని గిజబ, నందివానివలస, సంతోషపురం గ్రామాల పరిధిలో సంచరించాయి.

శనివారం నందివానివలసలో ఏనుగుల సంచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉన్న అరటి, మొక్కజొన్న తదితర పంటలు ఏనుగులు నాశనం చేస్తాయోనని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏనుగుల నుండి రక్షణ కల్పించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

ఆటోను ఢీకొన్న లారీ: నలుగురికి గాయాలు

- ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు
- అంటిపేట ఎఫ్‌సీ గొడౌన్ వద్ద దుర్ఘటన



గుమ్మలక్ష్మీపురం: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రవీణ్‌కుమార్



పార్వతీపురం: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పార్వతీపురం: మండలంలోని అంటిపేట ఎఫ్‌సీ గొడౌన్ దగ్గరలో ఆటోను లారీ ఢీకొంది. ఈ దుర్ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. పార్వతీపురం అవుట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శనివారం సీతానగరం మండలంలోని పనుకుపేటకు చెందిన ఆటోడ్రైవర్ పి.శ్రీను ఆటోలో పనుకుపేట నుంచి రామభద్రపురం కూరగాయల మార్కెట్‌కు అదే గ్రామానికి చెందిన ఎం.సుబ్బారావు, ఎం.కరుణాకర్, ఎం.రవి వెళ్తున్నారు. సరిగ్గా ఎఫ్‌సీ గొడౌన్ దగ్గరకు వచ్చేసరికి బొబ్బిలి నుంచి పార్వతీపురం వైపు వస్తున్న లారీ, వీరి ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తాపడగా, అందులో ప్రయాణిస్తున్న ముగ్గురితో పాటు డ్రైవర్‌కు కూడా తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో వైద్యసేవల నిమిత్తం 108 అంబులెన్స్‌లో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దిగువమండ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. శనివారం సాయంత్రం బాలేసు గ్రామసచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్ విధులు ముగించుకుని, తన ద్విచక్ర వాహనంపై గుమ్మలక్ష్మీపురం వస్తుండగా, దిగువమండకు చెందిన కె.గోవిందరావు పొలంపనులు ముగించుకుని తన బైక్‌పై వస్తున్నాడు. ఎదురెదురుగా వస్తున్న వీరిద్దరి బైక్‌లు ఒకదానికొకటి ఢీకొనడంతో గాయపడ్డారు. అప్రమత్తమైన స్థానికులు వైద్యసేవల నిమిత్తం ఇరువురినీ భద్రగిరి ఆస్పత్రికి తరలించారు. అదుపు తప్పడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

పిచ్చికుక్క దాడిలో..

గజపతినగరం: పిచ్చికుక్క దాడిలో మండల కేంద్రంలోని దిగువ వీధికి చెందిన బి.వరలక్ష్మి(60), సీహెచ్ తేజశ్విని(14)కి గాయాలయ్యాయి. రోడ్డుపై కాలినడకన వెళ్తున్న వీరిని అటువైపుగా వెళ్తున్న ఓ పిచ్చికుక్క కరిచినట్లు బాధితులు తెలిపారు. వైద్యసేవల నిమిత్తం వారిని స్థానిక ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ఇటీవల జరిగిన పిచ్చికుక్క దాడిలో 15 మంది గాయపడిన ఘటన మరువకముందే ఈ ఘటన జరగడం విచారకరం. పిచ్చికుక్కల స్వైరవిహారంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నాడు-నేడు నిధుల దుర్వినియోగంపై విచారణ

పూసపాటిరేగ: పసపాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనుల నిమిత్తం కేటాయించిన మనబడి నాడు-నేడు నిధుల దుర్వినియోగం నేపథ్యంలో ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వరరావుపై వెల్లువెత్తిన ఆరోపణలపై శనివారం విచారణ చేపట్టారు. ఇదే విషయంపై పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఒమ్మి రమాదేవి గతంలో ఫిర్యాదు చేయగా, స్పందించిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు విచారణకు ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు శనివారం జెడ్పీ సీఈఓ అశోక్‌కుమార్, పూసపాటిరేగ ఎంఈఓ రమణమూర్తి కలిసి విచారణ ఆరంభించారు. నిధుల వినియోగంలో అవకతవకలతో పాటు రికార్డుల నిర్వహణలో కూడా లోపాలున్నట్లు గుర్తించారు. ఫేజ్-1లో రూ.30,65,996 మంజూరు కాగా వాటిలో రూ.29,34,105 వివిధ పద్దుల కోసం ఖర్చు చేశారు. వీటిలో రూ.13,23,615లను సీపీఎం మెటీరియల్‌కు, రూ.16,10,490లను సివిల్ వర్క్ లేబర్ కాంపొనెంట్ వర్క్‌కు గాను ఖర్చు చేసినట్లు తెలిపారు. అయితే వీటికి సంబంధించి, ఎటువంటి రిజిస్టర్లు గానీ రికార్డులు గానీ, తీర్మానాలు గానీ, చెక్కు ఇష్యూ రిజిస్టర్, స్టాక్ రిజిష్టర్ లేనట్లు తేలింది. తదుపరి చర్యలకు దీనికి సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు అందజేసినట్లు సదరు అధికారులు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



నెల్లిమర్ల రూరల్: మృతుడు రామునాయుడు



గజపతినగరం రూరల్: ఘటన స్థలంలో తీవ్రగాయాలతో యువకుడు వంశీ

నెల్లిమర్ల రూరల్: వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన ఘటన నెల్లిమర్ల, గజపతినగరం మండలాల పరిధిలో శనివారం చోటుచేసుకుంది. మండలంలోని కొండవెలగాడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బూరాడపేటకు చెందిన బెల్లాన రామునాయుడు(59) దుర్మరణం చెందాడు. కొండవెలగాడ వైపు వెళ్తున్న ఆటో.. విజయనగరం నుంచి మోటార్‌బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్ వెనక కూర్చొన్న రామునాయుడు తలకు తీవ్రగాయమై, ప్రాణాలు విడిచాడు. దీనిపై పోలీస్ కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించామని ఎస్ఐ నారాయణరావు తెలిపారు.

బైక్ అదుపుతప్పి..

గజపతినగరం రూరల్: మండలంలోని మధుపాడ సమీపంలో ఉన్న జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడడ్ల వంశీ(28) అనే యువకుడు మృతి చెందాడు. సీఐ లెంక అప్పలనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పార్వతీపురం మండలంలోని బాలగుడబ గ్రామానికి చెందిన వంశీ బైక్‌పై పార్వతీపురం నుంచి విజయనగరం వస్తుండగా మధుపాడ దగ్గరలోకి వచ్చేసరికి బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న సీసీ కాలువలకు బలంగా ఢీకొంది. దీంతో తీవ్రగాయాలపాలైన అతడిని వైద్యసేవల నిమిత్తం దగ్గరలోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

చెరువులో పడి చిన్నారి..



లావణ్య(ఫైల్)

పాలకొండ: చెరువులో పడి ఎనిమిదేళ్ల చిన్నారి కుడుతుల లావణ్య శనివారం మృతి చెందింది. ఈ విషాద ఘటన మండలంలోని కొండాపురంలో చోటుచేసుకుంది. ఉదయం 10 గంటలకు భోజనం చేసిన తర్వాత ఇంటికి సమీపంలోని కొండమ్మచెరువు వద్దకు నలుగురు స్నేహితులతో కలిసి ఆడుకోవడానికి వెళ్లిన లావణ్య కాసేపు ఆడుకున్న తర్వాత స్నానానికి అక్కడి చెరువు దగ్గరకు వెళ్లింది. చెరువు గట్టు మెట్లపై కూర్చొని, స్నానం చేస్తుండగా, ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిపోయింది. మిగతా పిల్లలు పరుగు పరుగున గ్రామంలోకి వెళ్లి గ్రామస్తులకు సమాచారం ఇవ్వగా, అక్కడి చేరుకున్న గ్రామస్తులు చెరువులోకి దిగి, బాలికను ఒడ్డుకు చేర్చారు. కొనఊపిరితో ఉన్న ఆ బాలికను ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో చనిపోయింది. కూతురు చనిపోవడం చూసి, తల్లిదండ్రులు సురేష్, అన్నపూర్ణ కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

- ఇన్‌చార్జ్ జేసీ విష్ణుచరణ్

సాలూరు: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని ఇన్‌చార్జ్ జేసీ, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ హెచ్చరించారు. పట్టణంలో ఏరియా ఆస్పత్రిని ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏరియా ఆస్పత్రిలో సిబ్బంది విధి నిర్వహణపై ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. సిబ్బంది పని తీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు. సేవా భావానికి ప్రతీకైన వైద్య వృత్తి గౌరవాన్ని అందరు నిబద్ధతతో పని చేసి నిలబెట్టాలని అన్నారు. ఆస్పత్రికి వస్తున్న రోగులకు సంతృప్తికరంగా వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రిలో వైద్య సేవలపై మళ్లీ ఆరోపణలు వస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఆస్పత్రికి మంచాలు, ఫ్యాన్లు అందించారు. బంగారమ్మపేటలో జరుగుతున్న మలేరియా స్ప్రేయింగ్‌ను, కొత్తవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల ప్రత్యేక తరగతుల తీరును పరిశీలించారు. ప్రజలు ఇళ్లల్లో, పరిసరాల్లో మలేరియా స్ప్రేయింగ్ చేయించుకోవడం ద్వారా దోమల నివారణకు సహకరించాలని కోరారు.

మరో తొమ్మిది రోడ్లకు ‘అటవీ’ అనుమతులు



సమీక్షిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లా అటవీ హక్కుల కమిటీ మరో తొమ్మిది రోడ్లకు అటవీ అనుమతులు మంజూరు చేసినట్లు కలెక్టర్ నిషాంత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టర్ అధ్యక్షతన తన కార్యాలయంలో జిల్లా అటవీ హక్కుల కమిటీ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో విస్తృతంగా చర్చించి మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం తొమ్మిది రోడ్లకు అనుమతులు జారీ చేశారు. ఇందులో భామిని మండలం మనిగ నుండి అంటిజోల వరకు (శ్రీకాకుళం జిల్లా వరకు), నడిమిగూడ కాలనీ నుండి గేదెలగూడ వరకు, కొత్తగూడం నుండి నడిమిగూడ వరకు, దిమ్మిడిజోల నుండి కొత్తగూడం వరకు, డోకులగూడ కాలనీ నుండి శ్రీకాకుళం జిల్లా సరిహద్దు, సీతంపేట మండలంలో రేగులగూడ నుండి పాతపెద్దగూడ, పాతరంగంవలస నుండి రంగంవలస, పెద్దగూడ నుండి పాతరంగంవలస వరకు రహదారులకు అటవీ అనుమతులు మంజూరు చేశారు.

ఈ రహదారులను పీఎంజీఎస్‌వై - ఆర్‌సీపీఎల్ డబ్ల్యూఈ గ్రాంటు రూ.17.06 కోట్లతో 21.50 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. ఇందులో 8.55 హెక్టార్ల అటవీ ప్రాంతం ఉంది. సమావేశంలో సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి, జిల్లా అటవీ అధికారి జీఏపీ ప్రసూన, పంచాయతీ రాజ్ కార్యనిర్వహణ ఇంజినీర్ ఎస్.రాధారాణి, అటవీ రేంజ్ అధికారి జె.తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.